క్లుప్తంగా

బీజేపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సంజీవరెడ్డి

సుల్తానాబాద్: మండలంలోని మియాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ విద్యాసంస్థల అధినేత ఎర్రంశెట్టి మునీందర్ బీజేపీలో చేరారు. మండలకేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన బీజేపీ ముఖ్యకార్యకర్తలు సమావేశంలో కరీంనగర్ సాన్వి డిఫెన్స్ అకాడమీ అధినేత మునీదర్‌కు జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి బీజేపీ కండువా కప్పి ఆహ్వానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు మునీందర్ ప్రకటించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మీస అర్జున్‌రావు, సీనియర్ నాయకులు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, కడారి అశోక్‌రావు, మహేందర్, కందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

రామగుండం: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం అంతర్గాం జంక్షన్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను నిర్లక్ష్యం చేస్తోందని, బీసీ రిజర్వేషన్లపై స్పష్టమైన నిర్ణయం తేలకముందే ఓ వైపు ఎన్నికల నిర్వహణ చేపట్టడం ప్రజలను గందరగోళ పరచడమేనన్నారు. బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవహారంతో రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని, కాంగ్రెస్ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతు చేయాలని కోరారు. పార్టీ అంతర్గాం మండల ఇన్‌చార్జి బోడకుంట సుభాష్, ఆలకుంట మల్లేశ్, కొల్లూరి లక్ష్మణ్, పురుషోత్తం, బరిగెల ప్రసాద్, సత్యంగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, కందుల సత్తయ్య ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మంథనిరూరల్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తద్వారా ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంథని మండలం ఆరెంద ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఎన్‌ఎం అమరావతి, ఎస్తేర్ రాణి విద్యార్థులకు పలు జాగ్రత్తలు సూచించారు. పాఠశాల హెచ్‌ఎం ఈదులపల్లి నర్సింహరావు, ఉపాధ్యాయులు శ్రీలత, సువార్త, గియాశొద్దీన్, సీఆర్పీ మల్లన్న, అమన్, ఆశావర్కర్ స్వప్న పాల్గొన్నారు.

విత్తనోత్పత్తి క్షేత్రాల పరిశీలన

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడూర్ గ్రామంలో విత్తనోత్పత్తి క్షేత్రాలను గురువారం మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ పరిశీలించారు. మండల పరిధిలో ప్రతీ గ్రామానికి నాణ్యమైన విత్తనం కార్యక్రమంలో భాగంగా ఈ వానాకాలం జూన్ మొదటివారంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన కేంద్రాల్లో అభివృద్ధి చేసిన వరి, పెసర విత్తనాలను ఇద్దరు అభ్యుదయ రైతులకు పంపిణీ చేశారు. పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈవోలు సుష్మ, యోజన, గ్రామ అభ్యుదయ రైతు లింగయ్య పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో గురువారం రాత్రి పోలీసుశాఖ కళాబృందంతో మూఢనమ్మకాలు, సైబర్‌నేరాలు, అసాంఘిక దురాచారాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, బాల్య వివాహాల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎలిగేడు ఎస్సై మధుకర్ మట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏఎస్సైలు శ్రావణ్‌కుమార్‌రాజు, శ్రీనివాస్, కానిస్టేబుల్ ఇమ్రోజ్, పోలీసుశాఖ కళాబృందం, 500మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

తుపాకులు కాదు.. బ్యాలెటే పరిష్కారం

గోదావరిఖనిటౌన్: అణగారిన బహుజన వర్గాలకు తుపాకులు, బుల్లెట్లు కాదు బ్యాలెట్‌లే ముఖ్యమని బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ అధినేత కాన్షీరామ్ అన్నారని అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు అన్నారు. కాన్షీరామ్ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక తెలంగాణ అంబేద్కర్ ట్రస్ట్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. శశిభూషణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, రాజేశ్, బాల అంకూస్, సమ్మయ్య, వెంకటేశ్, శంకర్, రాజలింగు, హరికృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్మించారు.. వదిలేశారు



ప్రారంభోత్సవానికి నోచుకోని మహిళా స్వశక్తి భవనం



నిరుపయోగంగా కమ్యూనిటీ టాయిలెట్స్

- విసంపేటలో నిరుపయోగంగా కమ్యూనిటీ టాయిలెట్స్
- ప్రారంభానికి నోచుకోని మహిళా స్వశక్తి భవనం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని విసంపేట గ్రామ శివారులో ఐదేళ్ల క్రితం ఉపాధిహామీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ టాయిలెట్స్, మహిళా స్వశక్తి భవన నిర్మాణాలకు రూ.లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేయడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీ ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ఉపాధిహామీ సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించారు. కాగా ఇంటింటికీ వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండగా గ్రామ శివారులో రూ.లక్షలు వెచ్చించి కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మించారు. పైన నీటి ట్యాంకు ఏర్పాటు చేసినప్పటికీ సంపూర్ణంగా పనులు పూర్తి చేయకపోవడంతో ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉంటోంది. తలుపులు, వెంటిలేటర్లు, పైపులైన్, కరెంట్ పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దాని పక్కనే మహిళా స్వశక్తి భవనాన్ని నిర్మించినా కనీసం ప్రారంభించి మహిళా సంఘాలకు అప్పగిస్తే కనీస నిర్వహణతో భవన పరిసరాలు పరిశుభ్రంగా ఉండే అవకాశం ఉండేది. దాన్ని కూడా అధికారికంగా ప్రారంభించకపోవడంతో తలుపులు, కరెంట్ సామగ్రి, కిటికీలు, వెంటిలేటర్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఇలా రూ.లక్షలు వెచ్చించి లక్ష్యం పూర్తి కాకముందే మధ్యలోనే వదిలేయడంతో నిధుల దుర్వినియోగంతో పాటు వినియోగించుకునే అవకాశం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ వెంటనే స్పందించి వాటికి తాత్కాలికంగా పునరుద్ధరణ పనులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట గ్రామంలోని పెద్దమ్మ ఆలయం దగ్గర మూలమలుపు ప్రమాదకరంగా మారింది. మూలమలుపు వద్ద చింతచెట్టు కొమ్మలు రోడ్డు మీదికి రావడంతో మూలమలుపు వద్ద వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దగ్గరికి వచ్చే దాకా వచ్చే వాహనాలు కనిపించక పలు ప్రమాదాలు సైతం జరిగినట్లు స్థానికులు చెప్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చింత చెట్టు కొమ్మలను తొలగించడంతోపాటు, మూలమలుపు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రామగిరి: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న ఆధ్వర్యంలో గురువారం పన్నూర్‌లో మండల నాయకులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఆశావహులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరికి టికెట్ వచ్చినా అంతా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, నాయకులు సిద్దం మురళీకృష్ణ, ప్రవీణ్, ఆరెల్లి కొమురయ్యగౌడ్, సదానందం, సమ్మయ్య, అవినాశ్‌గౌడ్ పాల్గొన్నారు.



రామగిరి: మాట్లాడుతున్న అంతటి అన్నయ్యగౌడ్

స్థానిక ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను నిలబెడదాం

కమాన్‌పూర్: రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లడానికి బలమైన అభ్యర్థులను పోటీలో నిలబెడతామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు ఇంట్లో గురువారం ఆయన కాంగ్రెస్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి ఉన్నారు.

న్యూయార్క్‌లో మహాత్ముడికి ఎంపీ నివాళి



రామగుండం: అమెరికాలోని న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్య రాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ వెళ్లారు. గురువారం ఐక్యరాజ్యసమితి సమావేశానికి వెళ్లే క్రమంలో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ సమావేశంలో దేశంలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, పేదరిక నిర్మూలన, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి, ప్రపంచ శాంతి, భద్రత, పొరుగు దేశాలతో సహకారం తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చాయని ఎంపీ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ధర్మారం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బైకని కొమురయ్య తెలిపారు. కరీంనగర్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 10, 11, 12వ తేదీల్లో సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ అండర్–19 ఫుట్‌బాల్ పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు తరపున పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేని రాజ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు బైకని కొమురయ్య, మేకల సంజీవరావు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ముళ్లపొదల తొలగింపు



స్పందన

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీ 18వ డివిజన్ అల్లూరు గ్రామ శివారులో గత 2021 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఈనెల 7న సాక్షి దినపత్రికలో 'నిరుపయోగంగా మరుగుదొడ్లు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో రామగుండం కార్పొరేషన్ అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు స్పందించారు. గురువారం మరుగుదొడ్ల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్, మాజీ కార్పొరేటర్ మారెల్లి రాజిరెడ్డి మాట్లాడుతూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు నీటి వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాయకులు మార్క రాజు, రాకేశ్, రాజు, రమేశ్ ఉన్నారు.

షాట్‌పుట్ పోటీల్లో బంగారు పతకం



అభినందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ జూనియర్ కాలేజీ విద్యార్థి అనుముల జశ్వంత్ జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ షాట్‌పుట్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. 13న కరీంనగర్‌లో జరిగే ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటాడని విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థిని డైరెక్టర్ రజనీ, పీఈటీ అజయ్, మంజుల అభినందించారు.

కాన్షీరాం వర్ధంతికి తరలిన నాయకులు

జూలపల్లి: బహుజన సమాజ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత కాన్షీరాం వర్ధంతి సభకు పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు సీపెల్లి కొమురయ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. మల్లేశం, స్వామి, నర్సయ్య, పెద్దమల్లయ్య ఉన్నారు.

సింగరేణి కమ్యూనిటీ హాల్‌ను ఆధునీకరించాలి

గోదావరిఖని: ఫైవింక్లయిన్ ఏరియాలో ఉన్న సింగరేణి కమ్యూనిటీ హాల్‌ను ఆధునీకరించి కార్మిక కుటుంబాలకు అందుబాటులో తీసుకురావాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లాగౌడ్ కోరారు. జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో స్ట్రక్చర్ సమావేశంలో కార్మిక కుటుంబాలకు సంబంధించిన పలు అంశాలపై గురువారం చర్చించారు. జీడీకే–11వ గనికి సీసీరోడ్డు ఏర్పాట్లు చేయాలని, పవర్‌హౌస్‌కాలనీ, జీఎం కాలనీ, గాంధీనగర్‌కాలనీల్లో చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని కోరారు. మస్టర్లతో సంబంధం లేకుండా యాక్టింగ్ ఇవ్వాలన్నారు. క్వార్టర్లపై విద్యుత్ వైర్లు ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఐరన్‌రాడ్‌తో ఫిల్లర్ వేసి కేబుల్ పైకి లేపాలన్నారు. యాజమాన్యం తరపున ఎస్‌వోటూ జీఎం చంద్రశేఖర్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, మాదన మహేశ్, సిద్దమల్ల రాజు, విజయలక్ష్మి, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, గ్రూప్ ఏజెంట్ ఎల్.రమేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

నియామకాలు పూర్తి చేయాలి

గోదావరిఖని: స్థానిక సంస్థల ఎన్నికల కోడ్‌తో సింగరేణిలో నిలిచిన నియామకాలు, బదిలీలను వెంటనే పూర్తి చేయాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కోర్టు స్థానిక సంస్థల ఎన్నికలపై స్టే ఇచ్చిన నేపథ్యంలో డిపెండెంట్ ఉద్యోగుల వారసులు మెడికల్ పూర్తి చేసుకొని నియామక పత్రాల కోసం ఎదురు చూస్తున్న 373 మందికి వెంటనే ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలన్నారు. ఎంజీటీ, అండర్ మేనేజర్ల నియామకాలు కొనసాగించాలన్నారు. గత మెడికల్ బోర్డులో అన్‌ఫిట్ కాని ఉద్యోగులకు రివ్యూ బోర్డు ఏర్పాటు చేసి త్వరితగతిన పునః పరిశీలన జరపాలని కోరారు. రెగ్యులర్ మెడికల్ బోర్డులను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. మారుపేర్ల సమస్యలను పరిష్కరించి, డిస్మిస్ అయిన కార్మికులకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద అవకాశం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ సమస్యలను పరిష్కరించాలన్నారు. సింగరేణివ్యాప్తంగా నిలిచిన అంతర్గత బదిలీ విధానాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. ఈ సమస్యలపై సంస్థ ఈఅండ్‌ఎండీతో సమావేశమై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ బూటకపు హామీలను ఎండగట్టాలి

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో రూపొందించిన బాకీకార్డులను ఇంటింటికీ అందించి కాంగ్రెస్ బూటకపు హామీలను ఎండగట్టాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. పెద్దపల్లిలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం బాకీకార్డులను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ఆయన విడుదల చేశారు. తమది ప్రజాప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతల మాటలన్నీ బూటకమని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకే ఓటిచ్చి గెలిపించుకోవాలన్నారు. నాయకులు రఘువీర్‌సింగ్, గంట రాములు, తిరుపతిరెడ్డి, కొయ్యడ సతీశ్, మోహన్‌రావు, పాల రామారావు, మోబిన్, ఉప్పురాజ్‌కుమార్, మర్కు లక్ష్మణ్ పాల్గొన్నారు.



బాకీకార్డుల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రాధాకృష్ణకు నివాళి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్ ఖాజీపల్లిలో సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కింగ్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రామగుండం కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి రాధాకృష్ణ (40) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. కాగా సీఐటీయూ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు సీఐటీయూ జెండా కప్పి నివాళి అర్పించారు. రాధాకృష్ణకు భార్య, ఒక కొడుకు, కూతురు ఉన్నారు. సీఐటీయూ నాయకులు వై.యాకయ్య, ముత్యంరావు, వేల్పుల కుమారస్వామి, ఎన్.బిక్షపతి, రామాచారి, మహేశ్వరి, సారయ్య, రాధాకృష్ణ, వెంకటస్వామి, రవీందర్, చంద్రయ్య, సునీత, జావేద్, శోభన్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం సందర్శన

ఫెర్టిలైజర్‌సిటీ: అరవై ఏళ్లు పైబడిన వృద్ధులు తప్పనిసరిగా బీపీ, షుగర్ మందులు వాడాలని డీఎంహెచ్‌వో వాణిశ్రీ అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని గురువారం రామగుండం కార్పొరేషన్ 21వ డివిజన్ వీర్నపల్లిలోని ఈశ్వరకృప వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. డాక్టర్లు రాజమౌళి, లక్ష్మీ, మణికేశ్వర్‌రెడ్డిలు వృద్ధులకు ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. ఈశ్వర కృప వృద్ధాశ్రమ నిర్వాహకులు గంట సత్తయ్య, మాధవరెడ్డి, బట్టల వెంకయ్యగౌడ్, శ్రీనివాసరావు, గంట సుజాత, సీతారామరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన

కాల్వశ్రీరాంపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందుతుందని ఎంఈవో సిరిమల్ల మహేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఊశన్నపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు హెచ్‌ఎం ఈర్ల సమ్మయ్య తన భార్య ఏఎస్‌ఎం సునీత సొంత నిధులు వెచ్చించి విద్యార్థులకు గురువారం టై, బెల్టులు, ఐడీకార్డులు, విద్యాసామగ్రి అందించడం అభినందనీయమని ఎంఈవో కొనియాడరు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నరెడ్ల సునీత, మెటీరియల్ దాత ఏఎస్‌ఎం ఈర్ల సునీత, ఉపాధ్యాయులు సురేశ్, శ్రీవాణి, స్రవంతి పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

పెద్దపల్లిరూరల్: సమగ్రశిక్ష ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సమ్మెకాలంలో (23 రోజుల పాటు సమ్మె) వేతనం అందించాలని జేఏసీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి అన్నారు. పెద్దపల్లిలో గురువారం సమగ్ర శిక్ష ఉద్యోగ జేఏసీ సమావేశం జరిగింది. సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. 13ఏళ్లుగా పనిచేస్తున్న తమకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని వాపోయారు. సీఆర్‌పీల సంఘం అధ్యక్షుడు సుధాకర్, శ్రావణ్‌కుమార్, రహీముద్దీన్, సంపత్, శ్రీనివాస్, శ్రీలత ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• కాన్షీరాం వర్ధంతి

ఎలిగేడు: మండల కేంద్రంలో గురువారం బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత కాన్షీరాం వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. న్యాతరి పోచయ్య, నారాయణ, సదయ్య, జల్లి రమేశ్ ఉన్నారు.

• బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

కాల్వశ్రీరాంపూర్: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం కేటాయిస్తూ రాష్ట్ర సర్కార్ విడుదల చేసిన జీవో కోర్టు స్టేతో బీసీల మనోభావాలను దెబ్బతీసినట్లయిందని జాతీయ బీసీ సంఘం నాయకులు ఆకుల స్వామి వివేక్ పటేల్ అన్నారు. స్థానిక ఎన్నికలపై గురువారం కోర్టు స్టే ఇవ్వడంపై పటేల్ స్పందిస్తూ కోర్టు స్టే ఇస్తుందని తెలిసి రాష్ట్ర సర్కార్ ఎన్నికల టైంటేబుల్ విడుదల చేసిందన్నారు. ఒక చేతితో పెట్టి మరో చేతితో లాక్కున్న చందంగా కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టులను అడ్డంపెట్టుకుని డ్రామా చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వ స్పందన కోసం వేచి చూస్తున్నామని, త్వరలో రాష్ట్రవ్యాప్త ఆందోళనకు కార్యాచరణ ప్రకటిస్తామని, రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు ఇస్తామని పేర్కొన్నారు.

• పెద్దమ్మతల్లి ఆలయ నూతన కమిటీ ఎన్నిక

గోదావరిఖనిటౌన్: ముదిరాజ్ కులస్తుల ఇలవేల్పు స్థానిక శ్రీపెద్దమ్మ తల్లి, నాగదేవత ఆలయాల నూతన కమిటీని ఆలయ ప్రాంగణంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మనాలిఠాకూర్, అధ్యక్షుడిగా గుర్రాల చంద్రశేఖర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా స్వరాజ్ ముదిరాజ్, కోశాధికారిగా రాజేశ్‌ను ఎన్నుకున్నారు.

• 12న ఉమ్మడి జిల్లాస్థాయి కరాటే పోటీలు

గోదావరిఖనిటౌన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి కరాటే టోర్నమెంట్, ఎంపిక పోటీలు ఈ నెల 12న గోదావరిఖని ఆర్‌సీవో క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ జిల్లా సెక్రటరీ కనుకుంట్ల లక్ష్మణ్ తెలిపారు. ఈ పోటీలు జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల నుంచి అండర్–14, 17 బాల,బాలికలు పాల్గొంటారన్నారు. క్రీడాకారులు ఉదయం 9గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 99598 78744 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

• తాటి, ఈత చెట్లు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని చిన్నకల్వలలో తాటి, ఈత చెట్లను తొలగించిన వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజిగౌడ్ డిమాండ్ చేశారు. తాటి, ఈత చెట్లను తొలగించిన ప్రాంతాన్ని గురువారం నాయకులు పరిశీలించారు. అనంతరం తొలగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎక్సైజ్ సీఐ, ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గౌడ సంక్షేమ సంఘం నాయకులు అంజిబాబుగౌడ్, రమేశ్‌గౌడ్, సంపత్‌గౌడ్, విష్ణువర్ధన్ గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

• ప్రజా పోరాటాలతోనే హక్కుల సాధన

పెద్దపల్లిరూరల్: ప్రజా పోరాటాలతోనే హక్కులు సాధించుకునేందుకు తెలంగాణ ప్రజాఫ్రంట్ ముందుంటుందని టీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కొమురయ్య అన్నారు. పెద్దపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద గురువారం 16వ ఆవిర్భావ వేడుకలు జరుపుకున్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం ప్రజాపోరాటాల్లో ప్రజలంతా భాగస్వాములయ్యేలా ప్రజాఫ్రంట్ పాత్ర కీలకమైందన్నారు. నాయకులు పులిపాక రవీందర్, గాండ్ల మల్లేశం, సుధాకర్, రాజు, అంజయ్య పాల్గొన్నారు.

• గ్రామాల్లో ఎమ్మెల్యే సతీమణి పర్యటన

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే సతీమణి మనాలిఠాకూర్ పర్యటిస్తూ గ్రామీణ మహిళా రైతు కూలీలను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓ రైతుకు చెందిన ట్రాక్టర్‌ను స్వయంగా నడిపిస్తూ గ్రామాల్లో పర్యటించారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, ఎగ్లాస్‌పూర్, ఆకెనపల్లి గ్రామాల్లో పర్యటించి, సాగు చేస్తున్న పంటలు, ప్రస్తుత పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహిళలతో ముచ్చటించారు.

• నామినేషన్ కేంద్రాల వద్ద అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని గురువారం గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు సందర్శించారు. నామినేషన్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తుకు పలు సూచనలు చేశారు. సీఐ మాట్లాడుతూ నామినేన్ కేంద్రం వద్ద ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై ప్రసాద్, ఏఎస్సై రహీం ఉన్నారు.


• మానసిక దివ్యాంగుల కేంద్రంలో పండ్లు పంపిణీ

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని మానసిక దివ్యాంగుల కేంద్రంలో దివ్యాంగులకు జడ్జి దుర్గం గణేశ్ పండ్లు పంపిణీ చేశారు. గురువారం ముందస్తు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం జరిపారు. మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి గణేశ్ మాట్లాడుతూ మానసిక దివ్యాంగులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుని ఆరోగ్యవంతమైన జీవనశైలిని కొనసాగించాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతిరెడ్డి, ఏజీపీ దూడం ఆంజనేయులు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరేళ్ల శంకరయ్య, న్యాయవాదులు ఆంజనేయులు, రవీందర్, రమేశ్, శివకృష్ణ, రాజేంద్రప్రసాద్, ఐకేపీ ఏపీఎం కనుకయ్య పాల్గొన్నారు.

• వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొత్కపల్లి, మడక, కనగర్తి గ్రామాల్లో ఎస్సై దికొండ రమేశ్ ఆధ్వర్యంలో గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల మీదుగా సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్ మీదుగా వెళ్లిన వాహనాలను తనిఖీ చేసి అనుమతి పత్రాలు వారికి జరిమానా విధించారు.

స్వచ్ఛ సుల్తానాబాద్‌కు సహకరించాలి



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రమేశ్

సుల్తానాబాద్: ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత యజమానులపై ఉందని, స్వచ్ఛ సుల్తానాబాద్‌కు ప్రతీఒక్కరు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రమేశ్ కోరారు. గురువారం పట్టణంలోని స్వప్నకాలనీలో డ్రైనేజీలను శుభ్రం చేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండడంతో దోమలు పెరిగి జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.